## రైతు-కూలీ, కార్మిక, యువజన రాష్ట్ర సదస్సు తీర్మానం

# ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సెప్) తదితర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చల నుండి భారత్ బయటకు రావాలి!

**రెండవ** ప్రపంచ యుద్ధానంతరకాలంలో, ప్రపంచ ఆర్థికవ్యవస్థపై ఆధిపత్యం కొరకు నూతన ప్రపంచ వ్యవస్థను నెలకొల్పేందుకు అమెరికా సామ్రాజ్యవాదం బ్రెట్టన్ వుడ్ సంస్థలైన ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, 'వాణిజ్యం, సుంకాలపై సాధారణ ఒప్పందాలను' (గాట్) రుద్దింది. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలుగా వుండగా, గాట్ ఒక ఒప్పందంగా వుంది.

సామ్రాజ్యవాద సంక్షోభం తీవ్రమవటంతో ఆ భారాన్ని ప్రపంచ దేశాలపై మోపేందుకు సామ్రాజ్యవాదం పూనుకుంది. 1995 నాటికి ప్రపంచ వాణిజ్య సంస్థను రుద్దింది. సరుకులతో పాటుగా, సేవలనూ, పెట్టుబడి మదుపులను, మేధోపర హక్కులను ప్రపంచవాణిజ్య సంస్థ పరిధిలోకి తెచ్చింది. మూడవ ప్రపంచ దేశాలపై దోపిడీని పెంచుకునేందుకు ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌ల ద్వారా సంస్థాగత సర్దుబాటు కార్యక్రమాన్ని రుద్దింది. దీనికి ప్రపంచీకరణ అని పేరు పెట్టింది.

ఇంతగా దోపిడీ సాగించినా సామ్రాజ్యవాదం సంక్షోభం నుండి బయటపడలేకపోయింది. 1930ల నాటి ఆర్థికమాంద్యాన్ని గుర్తుకు తెస్తూ 2008లో మరొక తీవ్ర ద్రవ్య సంక్షోభంలో పడింది. దీనినుండి బయటపడేందుకు ప్రపంచ ఆర్థికంపై తన పట్టును మరింత బిగించేందుకు సామ్రాజ్యవాదం పూనుకుంది. ప్రపంచీకరణకు భిన్నంగా ద్విపక్ష ఒప్పందాలను ముందుకు తెచ్చింది. వాటిలో అనేకం ఆమోదం పొందాయి.

అదే సమయంలో అనేక బహుళపక్ష ఒప్పందాలు కూడా ప్రతిపాదించబడ్డాయి. యూరోపియన్ యూనియన్-ఆఫ్రికా దేశాలమధ్య ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం, అమెరికా-యూరపుల మధ్య అట్లాంటిక్ సముద్రాంతర వాణిజ్య, మదుపుల భాగస్వామ్యం(టిటిఐపి), పసిఫిక్ సముద్రతీర భాగస్వామ్యం(టిపిపి) ఇలాంటివే. ఈ ప్రాంతీయ ఒప్పందాలలో ప్రపంచవాణిజ్య సంస్థను మించిన నిబంధనలుండటమేకాక, అవే అంతటా అమలవుతాయి. మూడవ ప్రపంచదేశాలపై సామ్రాజ్యవాద పట్టును పెంచుతాయి.

2012లో 16 దేశాల మధ్య మొదలైన ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సిఇపి) చర్చలు ఇలాంటివే. ఇదికాక యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్ చర్చలు సాగిస్తున్నది. అమెరికాతో కూడా డబ్ల్యుటిఓపై చర్చలు సాగిస్తున్నది.

సరుకులు, సేవలు, మదుపులు, ఆర్థిక-సాంకేతిక సహకారం, పోటీ, మేధోపర హక్కులు ఆర్‌సిఇపి పరిధిలోకి వస్తాయి. ఇది గనుక అమలుజరిగితే, సాగుభూమిని, విత్తనాలను లాగివేసుకోవటం, జన్యుమార్పిడి విత్తనాలను ప్రవేశపెట్టడం, వ్యవసాయ సరుకులను భారత్‌లో కుమ్మరించడంద్వారా లక్షలాది రైతాంగ జీవనోపాధి నాశనమవటం జరుగుతుంది. తత్ఫలితంగా చిన్న వ్యాపారులూ, చిన్న పరిశ్రమదారులూ తొలగించబడతారు. ఆంక్షలు లేకుండా విదేశీ పెట్టుబడికి ప్రోత్సాహం, పేటెంటుల కాలపరిమితి పెంచటంవల్ల దేశ సహజ, ఆర్థిక వనరులు కొల్లబోవటంతోపాటు కార్మికవర్గంపై దోపిడీ అణచివేతలు తీవ్రమౌతాయి.

భారత ప్రభుత్వం ఆర్‌సిఇపి, తదితర స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాల చర్చలనుండి బయటకు రావాలనీ, దోపిడీ, సామ్రాజ్యవాద ఆధిపత్యంలేని భారతదేశంగా నిర్మించేందుకు ప్రజాప్రయోజనాలను ఈడేర్చటమే లక్ష్యంగా స్వతంత్ర, స్వావలంబన విధానాలు అనుసరించాలనీ ఈ రైతాంగ, కార్మిక, యువజన సదస్సు డిమాండు చేస్తూ తీర్మానిస్తున్నది.

**16-9-2017**
**విజయవాడ**

| ఏఐఎఫ్‌టియు(న్యూ) | రైతుకూలీసంఘం(ఆం.ప్ర) | నవయువసమాఖ్య |
|---|---|---|
| ఏపి రాష్ట్రకమిటి | రాష్ట్ర కార్యవర్గం | ఆంధ్రప్రదేశ్ |

ooooo